క్లుప్తంగా

దర్గాలో ఫాతెహాలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. వచ్చిన భక్తుల్లో చాల మంది పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఎల్లార్తి దర్గాల్లో ..



ఎల్లార్తి దర్గా ను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డీ సాయి బాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఆదోని సెంట్రల్: బదిలీలు, డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేసి వారిని బదిలీ అయిన పాఠశాలలకు పంపాలని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటీ మెంబర్ మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. గురువారం మండల విద్యాధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పని చేసి రిలీవర్ రాక ఆగిపోయిన ఉపాధ్యాయులందరిని తక్షణమే పంపించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు ఐడీ క్రియేట్ చేసి వారు జీతాలు పొందే విధంగా ట్రెజరీ అధికారులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుధాకర్ బాబు, రామ్మోహన్ రెడ్డి, భాస్కర్, సూర్యుడు, ఆంజనేయులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కూలీ మృతి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన బెళగల్ నాగేష్(50) అనే వలస కూలీ గుండెపోటుతో బుధవారం సాయంత్రం మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లకు చెందిన నాగేష్‌కు భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో పనులు లేకపోవడంతో 20 రోజుల క్రితం గోనెగండ్ల నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు పత్తి పనులకు వలస వెళ్లారు. బుధవారం సాయంత్రం అక్కడ పొలంలో పత్తిని తీస్తుండగా నాగేష్‌కు గుండె పోటు వచ్చింది. దీంతో పొలంలోనే కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు నాగేష్ మృతదేహాన్ని గురువారం గోనెగండ్లకు తీసుకువచ్చి దహన సంస్కారాలు చేశారు.

శ్రీమఠంలో విద్యుత్‌శాఖ మంత్రి, ఎమ్మెల్యేలు

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం విద్యుత్‌శాఖ రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యేలతో కలిసి మంత్రాలయం వచ్చారు. ముందుగా మంత్రి బృందం గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. ఆయనతో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పక్కీరప్పతాతకు పూజలు



మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని అవధూత పక్కీరప్ప తాతకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మేల్కొలుపు పూజల అనంతరం అభిషేకం చేసి మహా మంగళ హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

'మూగ'రోదన!

- పశువులకు ముద్ద చర్మ వ్యాధి
- ఊరూరా వ్యాపిస్తున్న వైనం
- తూతూ మంత్రంగా టీకాల కార్యక్రమం
- నివారణ చర్యలు శూన్యం
- ఆవేదనలో రైతులు



లంపీ స్కిన్ వ్యాధి సోకిన ఆవుదూడ

మంత్రాలయం: మూగజీవాలు రోదిస్తున్నాయి. ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్)తో కన్నీరెడుతున్నాయి. గాయాలతో కంటి మీద కునుకులేకుండా అల్లాడిపోతున్నాయి. ఊరూరా లంపీ స్కిన్‌తో బాధపడుతున్న ఎడ్లు, దూడలు, ఆవులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం తూతూమంత్రంగా టీకాలు వేసి చేతులు దులుపుకుంది. దోమల బెడద పెరిగిపోవడంతో ఈ మధ్య కాలంలో లంపీ స్కిన్ వ్యాధి వ్యాప్తి ఎక్కువవ్వడంతో పాడి, ఎడ్ల రైతులు ఆవేదన చెందుతున్నారు.

గ్రామాల్లో పశువుల సంతతి అధికం

నియోజకవర్గంలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. రైతులు సాగుకు అనుగుణంగా పశు సంపదను సైతం పోషిస్తున్నారు. ముఖ్యంగా నదీతీర ప్రాంత గ్రామాల్లో పశువుల సంతతి అధికంగా ఉంది. నియోజకవర్గంలోని మంత్రాలయంలో ఆవులు, ఎద్దులు 8,100, పెద్దకడబూరులో 19,420, కౌతాళంలో 11,147, కోసిగిలో 13,347 ఎడ్లు, ఆవులు, దూడలు ఉన్నాయి.

టీకాలు వేయడంలో నిర్లక్ష్యం

లంపీ స్కిన్ ప్రబలకుండా ప్రభుత్వం టీకాలు వేయడంలో కాస్త నిర్లక్ష్యంగానే ఉంది. దోమలు బెడద ఉన్న తరుణంలో టీకాలు వేయకుండా వదిలేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మాత్రమే అరకొరగా పశువులకు టీకాలు వేశారు. లక్షణాలు కనిపించని పశువులకు టీకాలు వేయకుండా వదిలేసినట్లు సమాచారం. లంపీ స్కిన్ వ్యాధికి ప్రత్యేకించి ఎలాంటి టీకా లేదు. కేవలం వ్యాధి సోకిన పశువుకు వ్యాధి నిరోధక శక్తి మందులు ఇస్తూ సరిపెడుతున్నారు. పశు వైద్యాధికారుల పనితీరు కూడా అంతంత మాత్రమే. పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం లేదని రైతులు, పశువుల పోషకులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రుల్లో మందులు లేవని బయట దుకాణాలకు రాయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. కొందరు రిటైర్డు కాంపౌండర్లు, వైద్యులు, ట్రెనింగ్ వైద్యులతో చికిత్సలు చేయించుకుంటున్న దుస్థితి.

లంపీ స్కిన్ వ్యాప్తి

ఈ వ్యాధి కేవలం ఎద్దులు, ఆవులు, దూడలకు మాత్రమే సోకుతుంది. ముఖ్యంగా దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో ఎక్కువగా దూడలకు వస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఎడ్లు, ఆవులకు కూడా సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకి ట జీవాల చర్మమంతా గుల్లలు బారుతాయి. వ్యాధి తీవ్రమైతే ముద్దలు పగిలి రక్తం స్రావం జరుగుతుంది. నియోజకవర్గంలో దాదాపు 1200 ఆవులు, దూడలు, ఎడ్లు వ్యాధికి గురయ్యాయి. ఊరికి 5–8 పశువులు వ్యాధి సోకిన ఉన్నట్లు అధికారులు అంచనా. వ్యాధి సోకిన పశువును కుట్టిన దోమ మరో పశువును కాటు వేస్తే వ్యాధి ప్రబలుతుంది. దోమ ద్వారానే ఇది అంటు వ్యాధిగా వ్యాప్తి చెందుతోంది.

కష్టంగా మారింది



మా ఆవుదూడకు మద్దచర్మ వ్యాధి సోకింది. చికిత్స చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కోసారి మందులు బయట షాపుల్లో తెచ్చుకోమని చెబుతున్నారు. మా ఊర్లో 10 పశువులకుపైగా వ్యాధి ఉంది. వ్యాధి ప్రబలుతుండటంతో చాలా మంది తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఈ వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.

– నర్సిరెడ్డి, మాధవరం

ఇసుక రవాణాకు బ్రేకులు



నది దారిలో ట్రాక్టర్లు వెళ్లకుండా గుంత తవ్విస్తున్న తహసీల్దార్ రమాదేవి

సాక్షి ఎఫెక్ట్

మంత్రాలయం : ఇసుక ముఠా ఆగడాలను ఎత్తిచూపుతూ గురువారం 'ఇసుక తోడేళ్లు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన తహసీల్దార్ రమాదేవి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకున్నారు. తుంగభద్ర నదిలోకి ట్రాక్టర్లు ప్రవేశించకుండా దారిని చెరిపేస్తూ అడ్డుగా గోతులు తవ్వించారు. జేసీబీ తీసుకెళ్లి శ్మశాన వాటిక దారిలో తవ్వకాలు చేయించారు. తహసీల్దార్ దాడులతో అప్రమత్తమైన ఇసుక ముఠా గురువారం చడీ చప్పుడు లేకుండా మిన్నకుండి పోయింది. బుధవారం ఐదు ట్రాక్టర్లకు రూ.25 వేలు జరిమానా కూడా విధించారు. ఆమెతోపాటు వీఆర్వో భీమన్నగౌడ్ ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ ఎప్పుడు అమలు చేస్తారు?



మాట్లాడుతున్న జిల్లా సాధన ఐక్య వేదిక కన్వీనర్ నూర్ అహ్మద్

ఆదోని అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మాస్టర్ ప్లాన్ ఎప్పుడు అమలు చేస్తారని సమాచార హక్కు చట్టం ద్వారా మైనార్టీ సమితి రాష్ట్ర కార్యదర్శి, ఆదోని జిల్లా సాధన ఐక్య వేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి ఎందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేయలేదన్నారు. ఇప్పటికీ ఎన్ని మాస్టర్ ప్లాన్‌లు వచ్చాయి, ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ అమలు చేసే ఉద్దేశం ఉందా, లేదా? అని నిలదీశారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ ఏ విధమైన చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. అలాగే ఆదోనిలో వంకల వెడల్పు ఎంత? వంకల పక్క ఎన్ని పట్టాలు ఇచ్చారు, అదేవిధంగా వంకల కబ్జాలు తొలగించడానికి మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. ఆదోని పట్టణ ప్రజలకు ఈ సంవత్సరం మంచినీరు అందించడానికి ఎలాంటి ప్రణాళిక ఉంది? అనే విషయాలను మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్రయాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలే



ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇలా ..



మార్కెట్‌కు పత్తి తరలిస్తున్న వాహనాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలో వాహనదారులు, పాదచారులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పరి బైపాస్ రహదారి నుంచి అటు తిమ్మారెడ్డి బస్టాండ్, ఇటు ఏరియా ఆసుపత్రి మీదుగా శిరుగుప్ప సర్కిల్ వరకు, ఎమ్మిగనూరు బైపాస్, ఎమ్మిగనూరు సర్కిల్ వరకు ఉదయం 9 గంటలు అయిందంటే మొత్తం రద్దీగా ఉంటున్నాయి. వాహనాలు పత్తికొండ, ఆస్పరి, శిరుగుప్ప, ఆలూరు, ఎమ్మిగనూరు, మాదవవరం నుంచి పట్టణం మీదుగానే రాక పోకలను కొనసాగిస్తుండడంతో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగి పోతోంది. ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోసిగి నియోజకవర్గాలలోని రైతులు పండించిన పంటల దిగుబడులను మార్కెట్ కు తీసుకొని వస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. ఎక్కడైన వాహనం ఆగిపోయిందంటే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులను వెడెల్పు చేసి, పాదాచారులు వెళ్లేందుకు ప్లాట్ ఫామ్, పార్కింగ్ స్థలాన్ని కేటాయించే విధంగా నిర్మాణం చేపడితే సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

ఆక్రమణలు, అడ్డగోలు పార్కింగ్‌తో..

పట్టణంలో ప్రధాన రహదారి, పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి పెద్ద మార్కెట్‌కు వెళ్లే ఎంఎం రహదారి, శ్రీనివాస భవన్ నుంచి పెద్ద మసీదుకు వెళ్లే రహదారి, బిఎన్ టాకీస్ రహదారి, బంగారు బజార్, ప్రభాకర్ టాకీస్ రహదారి వంటి పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, ఆటోలు వంటివి అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఏవైనా భారీ వాహనాలు వస్తే సైడ్ తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే షాపు యజమానులు రహదారి మీదకు వచ్చి తమ షాపులను కట్టుకోవడంతో రహదారి కుంచించుకు పోయింది. దీనికితోడు కొంతమంది రోడ్లు మీదనే తమ వాహానాలను వదలి గంటల తరబడి పనులను చక్కబెట్టుకొని వెళుతుంటారు. దీంతో ఎక్కడికక్కడే ట్రాఫిక్ స్తంభించి పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు వాహనదారులకు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తు హెచ్చరికలు జారీ చేస్తున్న మారడం లేదు. బైపాస్ రహదారిని త్వరలో పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపడితే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే పట్టణంలోని రహదారులు వెడెల్పు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసే కుట్ర



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసి, ప్రజలకు ఉచిత వైద్యం అందకుండా చేయాలనే కుట్రతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగిస్తోందని, దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఒకటవ వార్డులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందించడంతో పాటు బడుగులకు ఉచిత వైద్యం అందేలా మాజీ సీఎం వైఎస్ జగనన్న గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మిస్తే.. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆమేరకు తమ పార్టీ ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శశికుమార్, బండరాజశేఖర్, వీరేష్, శ్రీనాథ్, రామలింగప్ప, కోట గణేష్, గోపాల్, వెంకటేష్, మహేష్, శ్యామ్, శంకర్, కాకవీరేష్, కరీంసాబ్, విశ్వనాథ్, అర్జున్, జగదీష్, శోభ, సాయికిరణ్, అక్షయ్‌కుమార్, ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

హాలహర్వి: మండలకేంద్రమైన హాలహర్వి సమీపంలోని బాట మారెమ్మ దేవాలయం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను గురువారం మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో అఖిల్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తలకు గాయాలై, చెవిలో రక్తస్రావమయ్యింది. అటుగా వెళ్తున్న వారు గమనించిన స్థానికులు, బంధువుల సాయంతో వెంటనే ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. బంధువులు అఖిల్‌ను బళ్లారి ఓపీడీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

19న 'మాతృదర్శనం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ప్రముఖ పద్య కవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చేగిరెడ్డి చంద్రశేఖర రెడ్డి రచించిన ×మాతృదర్శనం₹ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని రచయిత తెలిపారు. తెలుగు భాష వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు.

వామపక్ష నాయకుల అరెస్ట్ తగదు

దేవనకొండ: ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన సందర్భంగా సీపీఎం, సీపీఐ, ఆయా పార్టీల ప్రజా సంఘాల నాయకుల అరెస్టు తగదని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేసే లాగా, ప్రజలు, ప్రజా సంఘాల నాయకుల స్వేచ్ఛను హరించేలా పోలీసుల వైఖరి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసేందుకు భారత పౌరులకు రాజ్యాంగమే హక్కు కల్పించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తూ కర్నూలు పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారన్నారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని, గృహ నిర్బంధం దగ్గర నుంచి పోలీసులు వెనక్కి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు.

విద్యాబోధన కుంటు పడకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి భీమా రెడ్డి

ఆదోని సెంట్రల్: డీఎస్సీ నియామకాల తర్వాత కేటగిరి–1, 2లలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులలో వర్క్ అడ్జెస్ట్‌మెంటు ద్వారా కానీ, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యాబోధన కుటు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురామయ్య, జిల్లా కార్యదర్శి భీమా రెడ్డి కోరారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముత్తన్న అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ జూన్‌లో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారాణంగా పాత పాఠశాలల్లోనే పనిచేస్తున్నారని, వారిని తక్షణమే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు ఉద్యోగ ప్రమాణం చేసిన అక్టోబర్ 3 వ తేదీ నుంచే వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మరి సిద్దయ్య, మల్లికార్జున, రామసుబ్బా రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అవస్థలు



గోనెగండ్లలో ఇరిగేషన్ భవనంలో తహసీల్దార్ కార్యాలయం



ఇరిగేషన్ భవనంలో వ్యవసాయ కార్యాలయం

గోనెగండ్ల: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలీచాలనీ గదులతో పాటు కనీస సౌకర్యాలు లేక అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, వెలుగు కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు ఇరిగేషన్ శాఖకు చెందిన భవనాల్లో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. వీటి అన్నింటికీ ప్రతినెలా వేలాది రూపాయల ప్రజాధనం వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనాలకు అద్దె చెల్లించడం లేదు. వీటిలో కొన్ని శిథిల భవనాలు కావడంతో వర్షం వస్తే ఈ కార్యాలయాల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. ఇలా ఏళ్ల తరబడి ఇరిగేషన్ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

ఘనంగా ధ్వజారోహణం




నంచర్ల మార్కండేయ దేవాలయం దగ్గర ధ్వజస్తంభం నిలబెడుతున్న దృశ్యం,



ఆలయంలోని శివలింగం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన మార్కండేయ దేవాలయంలో నూతన ధ్వజారోహణ కార్యక్రమం గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, నూతన నంది, నాగప్పల విగ్రహాల ఏర్పాటు, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని ప్రజలు తమ ఆడపడచులకు ఒడిబియ్యాలు వేసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ధ్వజ స్తంభం, నంది విగ్రహాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన బుక్కపిండ్ల అంజనయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య బుక్కపిండ్ల అచ్చమ్మ ఆర్థిక సాయం అందించారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు గోపాల్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





నూతనంగా ఏర్పాటు చేసిన నంది విగ్రహం, నాగప్పలు

19న హరికథా గానం

కర్నూలు కల్చరల్: సాంప్రదాయ కళలను బతికించుకుందాం అనే నేపథ్యంలో ఈనెల 19వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో టీటీడీ ఆస్థాన హరికథకురాలు లక్ష్మీ మహేష్‌చే హరికథా గానం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ×శ్రీకృష్ణ రాయబారం₹ అనే అంశంపై ఆమె హరికథా గానం చేస్తారని పేర్కొన్నారు. కళాభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.